సాక్షి నిజామాబాద్

గురువారం । 18 ఏప్రిల్ । 2024



పెట్టుబడి స్వల్పం..

తక్కువ పెట్టుబడితో కొత్తిమీర సాగు చేస్తూ ఎక్కువ లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. అంకాపూర్ రైతు సాయరెడ్డి.

- 8లో ▸



రైతులకు కాంగ్రెస్ మోసం

ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బాజిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.4 /27.5

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురియవచ్చు.

న్యూస్‌రీల్

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పరిశీలించిన సీపీ



ఖలీల్‌వాడి: నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పులాంగ్ చౌరస్తా, నిఖిల్‌సాయి, కోర్టు, బైపాస్ రోడ్డు, కృష్ణ మందిర్ చౌరస్తాలకు వెళ్లారు. ఏ సమయాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని ట్రాఫిక్ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉదయం ఎప్పటి నుంచి రాత్రి ఎప్పటి వరకు కొనసాగుతున్నాయని తదితర వివరాలు అడిగారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తదితరులున్నారు.

రైతులను ఆగంజేసిన వాన



డొంకేశ్వర్(ఆర్మూర్): అకాల వర్షం రైతులను మళ్లీ ఆగం జేసింది. బుధవారం రాత్రి డొంకేశ్వర్ మండలంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో వడ్ల కుప్పలపై టార్పాలిన్లు కప్పేందుకు రైతులు కల్లాల వద్దకు పరుగులు తీశారు. వానతో వడ్ల కుప్పల చుట్టూ వర్షపు నీరు చేరింది.

ఆటో కార్మికుల నిరసన బాట

కామారెడ్డి అర్బన్: ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పడుతున్నట్లు ఆటో యూనియన్ రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి బోదాసు నర్సింలు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు కోరినా ఫలితం లేనందున ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈనెల 24న తహసీల్దార్‌లకు, 26న కలెక్టర్లకు, 28న ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందిస్తామని తెలిపారు. మే మొదటి వారంలో రాష్ట్రవ్యాప్త రథయాత్ర, 17 లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సదస్సులు, తర్వాత వరంగల్‌లో రాష్ట్ర స్థాయి బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆందోళనలను విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్లను కోరారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మద్నూర్(జుక్కల్): అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలని లీడింగ్ ఫైర్‌మన్ నర్సింలు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో తలంబ్రాలు పోస్తున్న వేదపండితుడు



తాళిబొట్టును చూపిస్తున్న అర్చకుడు


కల్యాణ వైభోగమే..

శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయం, సుభాష్‌నగర్ కోదండ రామాలయం, డిచ్‌పల్లిలోని ఖిల్లా రామాలయం, ఆర్యనగర్ రామాలయంలో భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. చైత్రశుద్ధ నవమి రోజు రామచంద్రస్వామి పుట్టిన పునర్వసు నక్షత్రంలోనే రాములవారు సీతమ్మను పరిణయమాడారు. శ్రీ సీతారాముల కల్యాణ ఘట్టాన్ని వీక్షించిన భక్తులు పులకరించిపోయారు. ఖిల్లా రామాలయంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డిచ్‌పల్లి రామాలయంలో భూపతిరెడ్డి, డొంకేశ్వర్ రామాలయంలో పైడి రాకేశ్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నోటిఫికేషన్‌కు వేళాయె..

- పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం
- నామినేషన్‌లు సమర్పించనున్న అభ్యర్థులు
- నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ గురువారం వెలువడనుంది. ఆ వెనువెంటనే నామినేషన్ల ఘట్టం షురూ అవుతుంది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ వెలువడుతుండడంతో ప్రచార జోరు పెరగనుంది.



సుభాష్‌నగర్, నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికలు–2024 నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం గురువారం విడుదల చేయనుంది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన విషయంతెలిసిందే. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే అభ్యర్థుల నుంచి నిజామాబాద్ కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఎన్నికల అధికారిగా కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వ్యవహరించనున్నారు. పార్లమెంట్ పరిధిలో జిల్లా నుంచి నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాలున్నాయి. అందులో మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

✣ షెడ్యూల్ వెలువడక ముందు నుంచే ఓటర్ల నమోదు, రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఫస్ట్ లెవల్ ఈవీఎంల పరిశీలన, తదితర ఏర్పాట్లు చేశారు.

✣ పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, పరిశీలన, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించి పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

✣ సరిహద్దుల్లో అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా కేంద్ర బలగాలు, పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. రెవెన్యూ, వాణిజ్య పన్నులశాఖ, పోలీసులతో తనిఖీ బృందాలు నియమించారు. నగదు, బంగారం తరలింపుపై నిఘా పెంచారు. గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు.

✣ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బందిని నియమించి శిక్షణను పూర్తిచేశారు.

నియోజకవర్గం వివరాలు	
అసెంబ్లీ నియోజవర్గాలు	7
పోలింగ్ కేంద్రాలు	1807
ఎన్నికల సిబ్బంది	7769
మొత్తం ఓటర్లు	17,01,573
85ఏళ్లకు పైబడిన వృద్ధులు	9,874
దివ్యాంగులు	41,181

✣ ఇప్పటికే ఫస్ట్ లెవల్ చెకింగ్ పూర్తి కాగా, నామినేషన్లు పూర్తయ్యాక రెండో లెవల్, పోలింగ్‌కు ముందు రోజు మూడో లెవల్ చెకింగ్ చేయనున్నారు.

✣ సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. రెండో విడత ర్యాండమైజేషన్ అభ్యర్థుల సమక్షంలో చేపట్టనున్నారు.

✣ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు.

✣ పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ పాట్ల కేటాయించారు. పోలింగ్ రోజు ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో చేపట్టనున్నారు.

✣ డిచ్‌పల్లిలోని సీఎంసీ మెడికల్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్నిచర్యలు చేపడుతున్నారు.

✣ నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. కలెక్టర్ చాంబర్‌లోనే అభ్యర్థులు నామినేషన్లు వేయనున్నారు. కలెక్టరేట్ ప్రాంతమంతా 144 సెక్షన్ అమలులో ఉండనుంది.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

- నిబంధనలు తప్పక పాటించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. గురువారం నుంచే నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్, సీపీలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 25 తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. 26న నామినేషన్ల స్క్రూటినీ, 29న మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉపసంహరణకు చివరి గడువు అని పేర్కొన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని చెప్పారు. నామినేషన్లను కలెక్టర్ చాంబర్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సెలవు దినాలు మినహా.. మిగతా పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తామని వివరించారు. నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థులు రూ. 25వేలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన వారైతే రూ. 12,500లను సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు అకౌంట్ తెరవాలన్నారు. దీని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తూ పక్కాగా రికార్డులు నిర్వహించాలన్నారు.

నియోజకవర్గంలో 17,01,573 మంది ఓటర్లు

పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం 17,01,573 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు కోసం దాఖలైన దరఖాస్తులను ఈ నెల 25 వరకు పరిశీలించి జాబితాలో అర్హులైన వారి పేర్లను చేర్చడం జరుగుతుందన్నారు. దీంతో పోలింగ్ నాటికి ఓటర్ల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు మొత్తం 22 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో ఇప్పటివరకు రూ. 33,04,837 నగదుతో పాటు రూ. 28,00,000 విలువ చేసే ఆభరణాలు ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ బందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించామన్నారు. పోలింగ్ సిబ్బంది నియామకం పూర్తయ్యిందని చెప్పారు.

కలెక్టరేట్ వద్ద 144 సెక్షన్

నామినేషన్ల దాఖలు సందర్భంగా నిర్వహించే ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుతిస్తామన్నారు. మిగతా వారికి కలెక్టరేట్ మెయిన్ గేట్ నుంచి 200 మీటర్ల దూరం వరకే అనుమతి ఉంటుందన్నారు. ఎన్నికలను పురస్కరించుకుని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 1,900 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల కోసం తప్పని తిప్పలు

- చెడిపోయిన ఆడియో మెట్రీ మిషన్
- వినికిడి లోపం ఉన్న వారు హైదరాబాద్‌కు వెళ్లాల్సిందే..



చార్వీ

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన చార్వీకి పుట్టుకతోనే వినికిడి లోపంతో పాటు, మాటలు రావు. ఈ చిన్నారికి సదరం సర్టిఫికెట్ లభిస్తేనే దివ్యాంగుల పింఛన్‌తో పాటు ఇతర పథకాల్లో లబ్ధి చేకూరుతుంది. సదరం సర్టిఫికెట్ కోసం బాలిక తండ్రి రమేశ్ రెండు మూడేళ్లుగా తిప్పలు పడుతున్నా డు. ఇటీవల సదరం క్యాంపు కోసం స్లాట్ బుక్ చేయించారు. కానీ నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వినికిడి లోపం ఉన్న వారికి ప్రాథమికంగా పరీక్ష చేసే ఆడియో మెట్రి మిషన్ పనిచేయడం లేదని వైద్యులు తెలిపారు. సర్టిఫికెట్ కోసం మరోసారి స్లాట్ బుక్ చేసుకుని హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో హైదరాబాద్ వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. ఇలా.. ఒక్క చార్వీకి ఎదురవుతున్న సమస్యే కాదు. ఇలా ఎంతో మంది బాధితులు సదరం సర్టిఫికెట్ కోసం అవస్థలు పడుతున్నారు.

నిజామాబాద్ ఆస్పత్రిలో ఉన్న ఆడియో మెట్రి యంత్రం రెండేళ్ల క్రితం చెడిపోగా బాగు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వినికిడి లోపం ఉన్న వారు సదరం సర్టిఫికెట్ కోసం హైదరాబాద్ వెళ్లి పరీక్షలు చేయించుకుని వస్తేనే నిజామాబాద్‌లో సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. వినికిడి లోపం ఉన్నవారికి ప్రతినెలా కేవలం 15లోపు స్లాట్లను కేటాయిస్తున్నారు. ఇందులోనే రెన్యూవల్ చేసుకునే వారికి స్లాట్‌లు ఉంచారు. అసలే స్లాట్‌లు లేకపోవడం, సర్టిఫికెట్ల కోసం నిజామాబాద్, హైదరాబాద్‌లకు తిరుగుతూ ఎంతో మంది పేద, మధ్య తరగతి కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్‌ను బాగుచేయించి అందుబాటులోకి తీసుకువచ్చి ఇబ్బందులు తప్పేలా చూడాలని దివ్యాంగులు కోరుతున్నారు.



బీఈడీ కళాశాలలపై కొరడా!

- కనీస సౌకర్యాలు లేకపోతే అనుమతి నిరాకరణ
- మే చివరి వారం వరకు అవకాశం
- నేటి నుంచి కళాశాలల్లో తనిఖీలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని బీఈడీ కళాశాలలపై అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. కొన్నేళ్లుగా కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కళాశాలలపై ఈ సారి కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఈ ఏడాది బీఈడీ విద్యాబోధన ప్రారంభం కాకముందే కళాశాలలపై తనిఖీలు నిర్వహించి సౌకర్యాల ఏర్పాటుపై దృష్టి సారించనున్నారు. ఇందుకోసం తెలంగాణ యూనివర్సిటీ అకడమిక్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ కళాశాలల తనిఖీలు చేపట్టనున్నారు. సక్రమంగా ఉన్న కళాశాలలకే ఈ ఏడాది అనుమతి లభించేలా చర్యలు తీసుకోనున్నారు.



బోధన్‌లోని ఓ బీఈడీ కళాశాల

కొన్నేళ్లుగా అదే తీరు..

జిల్లా వ్యాప్తంగా 14 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో వంద సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పిస్తున్నారు. మూడు కళాశాలలో 50 సీట్లకు అనుమతి ఉంది. కానీ బీఈడీ కళాశాలలు ఎన్‌సీఈటీ(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్) నిబంధనల ప్రకారం కళాశాలలు కొనసాగాలి. కనీస సౌకర్యాలైన తాగునీరు, బాత్‌రూంలు, ఫర్నీచర్ ఏర్పాటు, బోధకుల ఏర్పాటు, ప్రతిరోజూ బోధన కొనసాగాలి. ఇవి కచ్చితంగా అమలు కావాల్సి ఉండగా జిల్లాలో ఆయా కళాశాలల్లో కొనసాగడం లేదు. 16 మంది రెగ్యులర్ బోధకులు కచ్చితంగా ఉండాలి. కానీ ఎక్కడా లేదు. నగరంలోని ఓ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు పాఠశాలలో కొనసాగుతోంది. కేవలం ఒక్క గదిలోనే విద్యాబోధన చేపడుతున్నారు. విద్యార్థులు కళాశాలకు రాకుండానే విద్యాబోధన కొనసాగుతుంది. సొంత భవనాలు లేవు. నగర శివారులోని ఓ బీఈడీ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నా విద్యాబోధన చేపట్టడం లేదు. కేవలం విద్యార్థులను పరీక్షలకు మాత్రం అనుమతి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. బోధన్‌లోని ఓ కళాశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. భవనం సక్రమంగా లేదు. కనీస సౌకర్యాలు కొనసాగడంలేదు. ఆర్మూర్‌లోని మరో కళాశాల లాడ్జి భవనంలో కొనసాగుతోంది. ప్రతి కళాశాలలో విద్యార్థులు రాకపోయినా వారి వద్ద డబ్బులు వసూలు చేసి అటెండెన్స్‌ను కొనసాగిస్తున్నారు. ఫ్యాకల్టీ మాత్రం ఎక్కడా లేదు. ఒక్కరు ఇద్దరితో కళాశాలను నడిపిస్తున్నారు. మేనేజ్‌మెంట్ సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారు. ల్యాబ్ ఫ్యాకల్టీ అందుబాటులో ఉండదు. తరగతి గదిలో ఫర్నీచర్ కూడా అందుబాటులో లేదు. ఇదే స్థితిలో జిల్లాలోని బీఈడీ కళాశాలలు కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయి.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకునేందుకు అకడమిక్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ నడుంబిగించారు. కళాశాలలను దారికి తీసుకురావడంపై దృష్టిసారించారు. దీనిలో భాగంగా నేటి నుంచి కళాశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టనున్నారు. సంబంధిత కళాశాలల్లో లోట్లుపాట్లను గుర్తించి మే చివరి వారం వరకు సంబంధిత కళాశాలలకు సౌకర్యలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వనున్నారు. లేదంటే సంబంధిత కళాశాలలకు ఈ ఏడాది బీఈడీ విద్యాబోధనకు అనుమతి రద్దు చేయనున్నారు. గతంలోనే ఇలాంటి కళాశాలల యజమాన్యాలను పిలిపించి పలుమార్లు సమావేశాలు నిర్వహించి పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా మార్పు రాకపోవడంతో ఈసారి కఠినంగా వ్యవహరించనున్నారు. కనీస వసతులు, ఫ్యాకల్టీ, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోనున్నారు. గతంలో కొన్ని కళాశాలలు కోర్టు ద్వారా అనుమతి తీసుకొని అడ్మిషన్లు కొనసాగించారు. ఇలాంటి కళాశాలలపై ముందస్తుగానే అధికారులు న్యాయబద్ధంగా చర్యలు తీసుకోనున్నారు.

లోపాలుంటే అడ్మిషన్లు రద్దు చేస్తాం

బీఈడీ కళాశాలలు నిబంధనల ప్రకారం కొనసాగవల్సిందే. లేదంటే చర్యలు తీసుకుంటాం. కళాశాలలను తనిఖీలు చేసి లోట్లు పాట్లను గుర్తిస్తాం. గడువులోగా మారితే మంచిదే. లేదంటే ఈ ఏడాది అడ్మిషన్లు కూడా రద్దు చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా కళాశాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, తెయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్

క్లుప్తంగా

మోతెలో 144 సెక్షన్‌

వేల్పూర్‌: మండలంలోని మోతె గ్రామంలో సీపీ కల్మేశ్వర్‌ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఈ నెల 20వ తేది వరకు 144 సెక్షన్‌ విధించినట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 144 సెక్షన్‌ ముగిసే వరకు గ్రామంలో ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది సమావేశం కావొద్దన్నారు. భూ వివాదం నేపథ్యంలో 144 సెక్షన్‌ విధించారు.

ఆర్మూర్‌ నుంచి తిరుపతి, ఢిల్లీకి రైళ్లు నడపాలి

కమ్మర్‌పల్లి: ఆర్మూర్‌ రైల్వే స్టేషన్‌ నుంచి తిరుపతి, న్యూఢిల్లీ వరకు రైళ్లు నడపాలని తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల నేషనల్‌ యూత్‌ ప్రాజెక్ట్‌, యునైటెడ్‌ నేషన్స్‌ ఆఫ్‌ యూత్‌ ఆర్గనైజేషన్‌ దక్షిణ ఆసియా మైత్రి సదస్సు సెక్రెటరీ జనరల్‌ బీఆర్‌ నర్సింగరావు, కార్యవర్గ సభ్యులు స్వామి, ఎం గంగాధర్‌ దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు సికింద్రబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత



కామారెడ్డి క్రైం: సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా గుర్తించి అందజేశారు.ఇటీవల దేవునిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పలువురు సెల్‌ ఫోన్‌ పోగొట్టుకున్న బాధితులు ఫిర్యాదు చేయగా బుధవారం 5 ఫోన్‌లను రికవరీ చేశారు. ఆయా ఫోన్‌లను బాధితులైన గంగాధర్‌,ఇదాయత్‌,లక్ష్మి, ఆకాశ్‌, సురేశ్‌కుమార్‌ లకు ఎస్సై రాజు అప్పగించారు.
ఎల్లారెడ్డి: ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసి బుధవారం అందించినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన చిలుక సత్తయ్య, కంజర్ల సిమన్‌ ఫోన్లు చోరీకి గురి కావడంతో సీఈఐఆర్‌ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వాటి ఆచూకీని కనుక్కొని బాధితులకు అందించినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు బాలసదనం బాలికల అదృశ్యం

కామారెడ్డి క్రైం: బాలసదనంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ఇద్దరు బాలికలు కనిపించకుండా పోయారు. పాఠశాల నుంచి బయటకు వెళ్లిన వారు బాలసదనంకు రాకుండా ఎక్కడికో వెళ్లిపోయారని ఫిర్యాదు రావడంతో పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. తల్లిదండ్రులు లేని ఇద్దరు బాలికలు కామారెడ్డిలోని బాలసదనంలో ఉంటూ హరిజనవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. ఎప్పటిలాగే ఈ నెల 13 న పాఠశాలకు వెళ్లిన వారిద్దరూ కొద్దిసేపటి తర్వాత ఎవరికీ చెప్పకుండానే బయటకు వెళ్లిపోయారు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో బాలసదనం ఇన్‌చార్జి గంగుబాయి బుధవారం పోలీసు లకు ఫిర్యాదు చేసింది. వీరిలో ఓ అమ్మాయి గతంలో రెండు సార్లు ఇదే విధంగా వెళ్లిపోగా వెతికి తీసుకువచ్చినట్లు బాలసదనం సిబ్బంది చెబుతున్నారు.

శ్రీరాముడి జీవితం ఆదర్శం



బాన్సువాడ రూరల్‌: శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శనీయమని, రాముని సుగుణాలు ఆచరణీయం, అనుసరణీయమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం ఆయన స్వగ్రామం పోచారంతో పాటు దేశాయిపేట్‌, సోమేశ్వర్‌, కొల్లూర్‌, తిర్మలాపూర్‌ గ్రామాల్లో తన సతీమణి పుష్ప, మాజీ డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి దంపతులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సోదరులందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తిర్మలాపూర్‌లో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని కాసేపు భజన చేశారు.

కమనీయం.. రాములోరి కల్యాణం


డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో దోలారోహణంలో ఎంపీ అర్వింద్‌


శ్రీసీతారాముల కల్యాణ వేడుకల్లో రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ రాములోరు సీతమ్మ మెడలో తాళి కట్టారు. ఉదయం 11.00 గంటలకు శ్రీరాముడి జననం (డోలారోహణం) కార్యక్రమం నిర్వహించారు. బాల రాముడిని ఊయలలో వేసి లాలి పాటలు పాడారు. మధ్యాహ్నం 12.01 గంటలకు ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో వేద పండితులు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా కుటుంబ సభ్యులు శ్రీసీతారాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, పుస్తె, మట్టెలు సమర్పించారు. పలువురు భక్తులు కన్యాదానం చేసి కట్నకానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకల్లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో కల్యాణ వేడుకల్లో నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ రేకులపల్లి భూపతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరామచంద్ర స్వామి వారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. దీనిపై దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిసి మాట్లాడినట్లు తెలిపారు. టీపీసీసీ డెలిగేట్‌ బాడ్సి చంద్రశేఖర్‌గౌడ్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ జంగం శాంతయ్య, మాజీ చైర్మన్‌ పొద్దుటూరి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్‌ గజవాడ జైపాల్‌, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దర్శించుకున్న ఎంపీ అభ్యర్థులు

బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌ కల్యాణ వేడుకలకు హాజరయ్యారు. శ్రీసీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, ఎస్సై మహేష్‌, ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్‌, సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌ గుప్తా కుటుంబ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. బచ్చు రాములు గుప్తా ఆధ్వర్యంలో పులిహోర, యూత్‌సభ్యులు పానకం, వడపప్పు భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి 7 గంటలకు శ్రీసీతారామ స్వామి వారికి అశ్వ వాహన సేవ నిర్వహించారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌ తదితరులు

అఫిడవిట్‌లో తప్పులుంటే తిప్పలే!

ఎన్నికల సమయంలో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో తప్పులు ఉంటే తర్వాత తిప్పలు పడాల్సి వస్తుంది. 2023లో కొత్తగూడం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్‌ సమర్పించారని ప్రత్యర్థులు కోర్టుకు వెళ్లడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు వెల్లడించారు. తర్వాత ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆర్మూర్‌ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి శాసనసభ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని కాంగ్రెస్‌ అభ్యర్థి వినయ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి హైకోర్టుకు వెళ్లారు.

- ఆస్తులు, నేర చరిత్ర పొందుపర్చాల్సిందే..
- లేదంటే న్యాయపరంగా ఇబ్బందులు

ఖలీల్‌వాడి: ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ కీలకంగా మారుతుంది. లోకసభ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపర్చాలి. అప్పులు, ఆస్తులు, కేసులు, శిక్షల గురించి తెలియజేయాలి. అభ్యర్థులు ఇచ్చిన అఫిడవిట్‌లో తప్పులు ఉంటే గెలిచిన తర్వాత ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. అభ్యర్థుల గురించి తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అభ్యర్థులు నామినేషన్‌ పత్రాలతోపాటు అఫిడవిట్‌ సమర్పించాలి. ఇందులో అభ్యర్థి ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు పొందుపర్చాలి.

పూర్తిగా నింపాలి

అభ్యర్థులు అఫిడవిట్‌లో ఉన్న మొత్తం కాలమ్స్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. తెలియని అంశాలు ఉంటే నిల్‌ లేదా వర్తించదు అని రాయాలి. అన్ని కాలమ్స్‌ పూర్తి వివరాలతో లేకపోతే నామినేషన్ల పరిశీలన సమయంలో తిరస్కరించే అవకాశం ఉంది.

కేసుల వివరాలు పక్కాగా ఉండాలి

అభ్యర్థులపై క్రిమినల్‌, సివిల్‌ కేసులు ఉంటే అఫిడవిట్‌ పొందుపర్చాలి. కేసులలో శిక్ష అనుభవిస్తే వాటికి సంబంధించిన వివరాలు ఉండాలి. కేసులపై పై కోర్టులకు అప్పీళ్లకు వెళ్తే ఆ వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. కేసులకు సంబంధించిన వివరాలను పేపర్‌లో యాడ్‌ వేయాల్సి ఉంటుంది. అలాగే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు, చేతిలో ఉన్న నగదు వివరాలు వెల్లడించాలి. కుటుంబ సభ్యులు చేసే వ్యాపారాలు, కంపెనీలు, పనుల వివరాలను వివరించాలి.

తప్పులు ఉంటే చిక్కులు తప్పవు

అభ్యర్థులు ఫారం–26లో అన్ని రకాల వివరాలను పొందుపర్చాలి. ఇందులో ఆస్తి, కేసులు, లావాదేవీల వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. తప్పుడు సమాచారం ఇస్తే న్యాయపరంగా చిక్కులు ఎదుర్కొవాల్సి ఉంటుంది.
– ఆశ నారాయణ, న్యాయవాది, నిజామాబాద్‌

ఎలుగుబంటి సంచారంతో గ్రామస్తుల ఆందోళన

లింగంపేట: లింగంపేట సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయానికి వెళ్లే ఎర్రమన్ను కుచ్చ అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఇటుక బట్టిలు తయారు చేసే ప్రాంతంలో ఉన్న నీటి గుంతలో ఎలుగుబంటి నీళ్లతాగి వెళ్లినట్లు గ్రామస్తులు గుర్తించారు. పెద్దవాగులో నీరు అడుగంటి పోవడంతో వాగుదాటి దాహం తీర్చుకోవడానికి పంటచేనుల్లోకి వస్తున్నాయని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎలుగుబంటి రాకుండా అటవీ శాఖ అధికారులు సాసర్‌ పిట్లలో నీరు నింపాలని కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్‌: అగ్ని ప్రమాదాలు జరిగే భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుంది. దీంతో అగ్ని ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అగ్ని మాపక శాఖ అధికారులు ఎక్కడ ప్రమాదం జరిగిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేస్తారు. అగ్నిప్రమాదం జరిగిన చోట తమ ధైర్య సహసాలతో ముందకు సాగి ప్రమాదాన్ని అరికడుతారు. 1944 ఏప్రిల్‌ 14న బాంబే ఓడరేవులో జరిగిన అగ్ని పమారదంలో 66మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్‌ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక శాఖ అధికారులు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన సిబ్బందికి నివాళులు అర్పించి, అగ్ని ప్రమదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.


ఆర్మూర్‌ అంబేడ్కర్‌ చౌరస్తాలో మాక్‌డ్రిల్‌ నిర్వహిస్తున్న అగ్నిమాపక అధికారులు(ఫైల్‌)

చేపట్టే కార్యక్రమాలు

వారోత్సవాల్లో భాగంగా ఏప్రిల్‌ 14న అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. 15న బహిరంగ ప్రదేశాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన, 16న అపార్ట్‌మెంట్‌లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 17న ఆస్పత్రిలలో, 18న ఎల్‌పీజీ గొడౌన్స్‌, 19 ఫంక్షన్‌ హాల్‌, విద్యాసంస్థలు, సినిమా థియటర్‌లలో, 20 అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌ సేఫ్టీపై వర్క్‌షాప్‌ నిర్వహిస్తారు.

నివారణ చర్యలు

- కాల్చిన సిగిరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా పడేయొద్దు.
- వంటింట్లో గాలి, వెలుతుర ఉండేట్లు చూసుకోవాలి.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా, కింద పడుకొని బొర్లాలి. లేక దుప్పటి చుట్టుకోవాలి.
- స్కూల్‌, షాపింగ్‌ మాల్‌లో, బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్‌ అలారం, ఫైర్‌ స్మోక్‌ డిటెక్టర్లను ఏర్పాటు చేసుకోవాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటికి తాళం వేసి బయటకు వేళ్లేటప్పుడు గ్యాస్‌ రెగ్యులేటర్‌ను ఆఫ్‌ చేయాలి. ఏసి, ఫ్రిడ్జ్‌ వైరింగ్‌ నాణ్యతను పరిశీలించాలి. ప్రమాదం జరిగితే ఆందోళన చెందకుండా మంటలను ఆర్పడానికి యత్నించాలి. ప్రమాదాలు జరిగితే వెంటనే 101, 8712699228 నంబర్లకు సమాచారం అందించాలి.
– మధుసూదన్‌రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి, ఆర్మూర్‌

పెట్టుబడి స్వల్పం.. ఆదాయం ఘనం

- కొత్తిమీర సాగులో లాభాలు గడిస్తున్న రైతు

పెర్కిట్‌(ఆర్మూర్‌): డిమాండ్‌, సప్లయి అనే ఆర్థిక సూత్రాన్ని తమకు అన్వయించుకుని పంటలను సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నారు మార్కెట్‌పై పట్టు ఉన్న రైతులు. తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలంలో కొత్తిమీర పంటను సాగు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌కు గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు కొమ్ముల సాయారెడ్డి. తనకున్న 13 ఎకరాల్లో వరి, పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న పంటలను సాగు చేస్తున్నారు. అలాగే రెండు ఎకరాల్లో అర ఎకరం చొప్పున నాలుగు విడతలుగా కొత్తిమీరను సాగు చేస్తున్నారు. రంజాన్‌ మాసంలో కొత్తిమీరకు డిమాండ్‌ ఉండడంతో గత జనవరి నెల మొదటి వారంలో అర ఎకరంలో కొత్తిమీరను సాగు చేసి 45 నుంచి 50 రోజుల్లో సుమారు రూ.45 వేలు అర్జించారు. పంటకు డిమాండు ఉండడంతో వ్యాపారులే వ్యవసాయ క్షేత్రానికి వచ్చి టోకున ఖరీదు చేసి తీసుకెళ్తున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా..

పెళ్లిళ్ల సీజన్‌, రంజాన్‌ మాసం కావడంతో కొత్తిమీరకు డిమాండ్‌ ఏర్పడింది. ఈ విషయం ముందే పసిగట్టిన రైతు సాయారెడ్డి రెండు ఎకరాల్లో నాలుగు విడతలు కొత్తిమీర సాగును చేపట్టారు. రంజాన్‌ మాసానికి అందడానికి జనవరి నెలలో మొదటి దఫాగా విత్తనాలను విత్తుకున్నాడు. జనవరి చివరి వారంలో రెండో దఫాగా కొత్తిమీర సాగు చేపట్టాడు. మార్చి మూడో వారంలో పంట చేతికి వచ్చింది. అలాగే ఫిబ్రవరి 10న మళ్లీ మార్చి 1న మూడు, నాలుగు దఫాలుగా కొత్తిమీర విత్తనాలను విత్తుకున్నాడు. కొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుంది.


అంకాపూర్‌లో కొమ్ముల సాయారెడ్డి సాగు చేస్తున్న కొత్తిమీర

తక్కువ పెట్టుబడి..

కేవలం 45 రోజుల స్వల్ప కాల పంట అయిన కొత్తిమీర సాగుకు పెట్టుబడి అంతంత మాత్రమే అవుతుంది. ఒక ఎకరంలో విత్తనాలకు రూ.7 వేలు, సస్యరక్షణ, ఎరువులకు రూ. 13 వేలు అయ్యాయి. పెట్టుబడి పోగా రైతుకు ఎకరానికి రూ.70 వేలు గిట్టుబాటు అయింది.

సేంద్రియ ఎరువులు వినియోగించా..



మార్కెట్‌లో లోకల్‌ కొత్తిమీరకు డిమాండ్‌ ఎక్కువగా ఉంది. దీంతో కొత్తిమీర సాగులో సేంద్రియ ఎరువులు వినియోగించాను. అలాగే పసుపు పంట పూర్తి కాగానే కొత్తిమీరను సాగు చేయడంతో దిగుబడి పెరిగింది. నాలుగు విడతలుగా సాగు చేయడంతో మార్కెట్‌లో డిమాండ్‌ ఉన్నపుడు మంచి ధర లభిస్తుంది.
– కొమ్ముల సాయారెడ్డి, రైతు, అంకాపూర్‌

క్రైం కార్నర్‌

గోదావరిలో ఈతకు వెళ్లి బాలుడి మృతి

రెంజల్‌: స్నేహితులతో కలిసి గోదావరి నదిలో ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కందకుర్తి గ్రామానికి చెందిన నవాజ్‌బేగ్‌(17) బుధవారం స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని మొగల్‌పుర ప్రాంతంలో గోదావరి నదిలో ఈతకు వెళ్లాడు. ఈత రాక ప్రమాదవశాత్తు నీటిలో మునగడంతో వెంటనే అతని స్నేహితులు కుటుంబీకులకు సమాచారం అందించారు. స్థానికులతో పాటు రెంజల్‌ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని గాలించగా నవాజ్‌ మృతదేహం లభించింది. నవాజ్‌బేగ్‌ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై సాయన్న తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బోర్గాం వద్ద బైక్‌ను లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. మంగళవారం మోపాల్‌ నుంచి బోర్గాంకు బైక్‌పై వెళ్తున్న ప్రదీప్‌ను ఇస్మాయిల్‌ ఫ్యాక్టరీ వద్ద లారీ ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్‌ అఫ్సర్‌ అజాగ్రత్తగా నడపడంతో బైక్‌ను ఢీకొట్టినట్లు చెప్పారు. మృతుడి బావ నరేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నిజామాబాద్‌ రూరల్‌: రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన మార్వాడే దమాపాల్‌ (33) మృతి చెందినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌ బుధవారం తెలిపారు. నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన ధమాపాల్‌ మంగళవారం స్నేహితులు ఉమాకాంత్‌, వినోద్‌తో బైక్‌పై వెళ్తున్నాడు. బైపాస్‌ రోడ్డులో శ్మశానం వైపు యూటర్న్‌ చేస్తుండగా అర్సపల్లి వైపు నుంచి వస్తున్న బొలెరో ఢీకొంది. ప్రమాదంలో దమపాల్‌ అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుడి తండ్రి గౌతమ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎల్పుగొండలో గుడిసె దగ్ధం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎల్పుగొండలో షార్ట్‌ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోయింది. గ్రామానికి చెందిన ఇప్పల్ల లక్ష్మి బుధవారం మధ్యాహ్నం శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి షార్ట్‌ సర్క్యూట్‌తో గుడిసె కాలి బూడిదైంది. కుల సంఘంలో తీసుకున్న అప్పు చెల్లించడానికి తీసుకొచ్చిన రూ.లక్ష నగదు, సామగ్రి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.



రోదిస్తున్న బాధితులు

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



పిట్లం(జుక్కల్‌): మండలంలోని కుర్తి గేట్‌ సమీపంలో బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం రోడ్డు కిందకు దూసుకెళ్లింది బాన్సువాడ నుంచి పిట్లం వైపు వెళ్తున్న బస్సు కుర్తి గేట్‌ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు.

వ్యాన్‌ను ఢీకొన్న బస్సు



భిక్కనూరు: భిక్కనూరు టోల్‌ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. నిజామాబాద్‌ వైపు నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న బస్సు ముందు వెళ్తున్న వ్యాన్‌ ఢీకొంది. వ్యాన్‌ డ్రైవర్‌ సడెన్‌ బ్రేక్‌ వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. బస్సు అద్దాలు ధ్వంసం పగిలిపోయాయి.

బెల్ట్‌షాపుపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మిర్చికంపౌండ్‌లో బెల్ట్‌ షాపు నిర్వహిస్తున్న సయ్యద్‌ బషీర్‌ అలియాస్‌ అజ్జును అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌ బాబు తెలిపారు. బుధవారం బెల్ట్‌షాపుపై దాడి చేసి 157 క్వార్టర్స్‌, 8 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.
పెద్దకొడప్‌గల్‌: మండలంలోని బెల్ట్‌ షాపులపై బుధవారం ఎక్సైజ్‌ అధికారులు దాడులు చేశారు. మండలంలోని వడ్లం గ్రామంలో కిరాణం దుకాణాంలో మద్యం అమ్ముతున్న జ్ఞానేశ్వర్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ సత్యనారాయణ తెలిపారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్‌

- ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారు
- 19న నామినేషన్‌ వేస్తా
- బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌


మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్‌

నిజామాబాద్‌ నాగారం: కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16న మాట్లాడుతూ ఆగస్టు 15 లోపు రైతంగానికి రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారన్నారు. ఎన్నికల కోడ్‌ రాకముందు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో ఆ పార్టీకీ ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. తాను ఎంపీగా గెలిస్తే గల్ఫ్‌ బాధితులకు అండగా ఉంటానన్నారు. ఎంపీ అర్వింద్‌ ఐదు ఏళ్లలో జిల్లాలోని ఏ గ్రామంలో పర్యటించలేదని ఆరోపించారు. ప్రజలు అర్వింద్‌కు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న ఎంపీ అర్వింద్‌ జిల్లాలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మాధవ్‌నగర్‌ బ్రిడ్జికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ.60 కోట్లు ఇస్తే కేంద్రం రూ.30 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జిల్లా గురించి ఎప్పుడైన మాట్లాడారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌, బీజేపీలను నమ్మొద్దని, బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థిగా ఈ నెల 19న నామినేషన్‌ వేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరు అవుతారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌, ఇందల్‌వాయి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌, నుడా మాజీ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

నా కుమారుడిపై తప్పుడు కేసులు

- బోధన్‌ మాజీ ఎమ్మెల్యే మహ్మద్‌ షకీల్‌ ఆమేర్‌

బోధన్‌: తనపై రాజకీయ శత్రుత్వంతో తన కుమారుడు రహీల్‌ను టార్గెట్‌ చేసి పోలీసులు హింసిస్తున్నారని బోధన్‌ మాజీ ఎమ్మెల్యే మహ్మద్‌ షకీల్‌ ఆమేర్‌ బుధవారం దుబాయ్‌ నుంచి విడుదల చేసి వీడియోలో ఆరోపించారు. రాజకీయ శత్రుత్వాలు మనం చూసుకుందామని, ఇందులో పిల్లలను ఇరికించి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని సీఎం రేవంత్‌ రెడ్డిని కోరారు. 2022 మార్చి 17న రాత్రి జూబ్లీ హిల్స్‌ రోడ్డులో తన కుమారుడి కారు ప్రమాద ఘటనపై మాజీ ఎమ్మెల్యే స్పందించారు. ఈ కేసులో తన కుమారుడిని ఇరికించేందుకు వెస్ట్‌ జోన్‌ డీసీపీ విజయ్‌ కుమార్‌ నేతృత్వంలో పంజాగుట్ట, జూబ్లీహిల్స్‌ పోలీసులు గంటల తరబడి విచారణ పేరిట హింసించారన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్‌ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. తన కుమారుడి తప్పు నిరూపితమైతే ఉరిశిక్ష వేసినా అభ్యంతరం లేదన్నారు. ప్రమాదం జరిగిన రోజు తన కుమారుడు డ్రైవింగ్‌ చేయలేదని, అప్పట్లోనే పోలీసులు విచారణ జరిపి కేసులు నమోదు చేయడంతో పాటు చార్జిషీట్‌ దాఖలు చేయగా కోర్టులో విచారణలో ఉందని వివరించారు. కారు యాక్సిడెంట్‌ కేసులో నిందితుడిగా ఉన్న డ్రైవర్‌ను బెదిరించి తన కుమారుడు డ్రైవింగ్‌ చేసినట్టు చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని షకీల్‌ ఆరోపించారు. ఈ కేసు విషయంలో కోర్టులో పోరాడుతామన్నారు తన కుమారుడికి ఎలాంటి హాని జరిగినా డీసీపీ విజయ్‌ కుమార్‌,పంజాగుట్ట, జూబ్లీ హిల్స్‌ పోలీసు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

21 సెక్షన్లతో కేసులు పెట్టడం న్యాయమా?

ప్రగతి భవన్‌ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన కేసులో తన కొడుకు రహీల్‌పై 21 సెక్షన్లతో కేసులు నమోదు చేశారని, ఇది న్యాయమా అని మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆ సమయంలో తాను దుబాయ్‌లో ఉన్నప్పటికీ ఎఫ్‌ఐఆర్‌లో తన పేరు చేర్చారన్నారు. రహీల్‌ను చట్టవిరుద్ధంగా అరెస్టు చేసి జ్యూడీషియల్‌ రిమాండ్‌కు పంపించారని, అయితే కోర్టు బెయిల్‌ ఇచ్చినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలతో తాను దుబాయ్‌లో చికిత్స తీసుకుంటున్నానని షకీల్‌ తెలిపారు.